క్లుప్తంగా

పేదలకు అన్నదానం

విజయపురిసౌత్: స్థానిక సీతారామాలయంలో శనివారం 200 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రిక్కల రామకృష్ణ కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ప్రతి శనివారం దాతల సహకారంతో పేదలకు అన్నదానం చేపడుతున్నామన్నా. అన్నదాన కార్యక్రమానికి ఆర్థికసాయం అందించే దాతలు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు



కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు కారెంపూడి పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.రమ్య బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తుకు తగ్గ బరువు ఉండేలా చూచుకోవాలని, పరిశుభ్రంగా ఉంటూ పరిశుభ్రమైన ఆహారపు అలవాట్లు చేసుకోవాలని డాక్టర్ సూచించారు. కంటి సమస్యలు, ఇతర మేజర్ అనారోగ్య సమస్యలున్నవారిని గుర్తించి వారిని డీఐఈసీ సెంటర్‌కు రిఫర్ చేయడం జరుగుతుందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం టి.రఘుబాబు, సీహెచ్ఓ మల్లయ్య, వైద్య ఆరోగ్య శాఖ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాలధారులకు సద్ది వితరణ



రెంటచింతల: స్థానిక శివాలయం ఆవరణలోని అయ్యప్ప సేవాసమితి మండపంలో శనివారం క్వారీ రామారావు కుటుంబ సభ్యులు, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి దంపతులు వేదపండితులు జిగురు చంద్రశేఖర్ నేతృత్వంలో హోమాలు నిర్వహించి 345 మంది స్వాములకు సద్ది వితరణ చేశారు. శ్రీను గురుస్వామి, పటాల సుబ్బారావు గురుస్వామి, వెన్నా వెంకటేశ్వర్‌రెడ్డి, కె.సైదులు, అంబటి శ్రీనివాసరెడ్డి, సోములు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను భక్తి శ్రద్ధలతో జరిపించారు. మండలంలోని గ్రామాలలో వివిధ స్వామి మాలలు ధరించిన మాలధారులకు నవంబర్ 16 నుంచి నుంచి డిసెంబర్ 26 వరకు సద్ది వితరణ చేపట్టినట్లు రెంటచింతల అయ్యప్ప సేవాసమితి కమిటీ సభ్యులు తెలిపారు.

బాలల హక్కుల వారోత్సవాలు

సత్తెనపల్లి: ఆడపిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య తప్పనిసరి అని హెచ్ఎం ఉమాదేవి అన్నారు. కంటిపూడి గ్రామ ఎంపీపీ పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీబీఆర్సీ కో–ఆర్డినేటర్ మేడే వెంకటరమణ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేస్తే.. శిక్షార్హులన్నారు. ఉపాధ్యాయులు సరోజ, విద్యార్థులు పాల్గొన్నారు. కంటిపూడి యానాది కాలనీలో కత్తి ఏసుబాబు, తిరుపతమ్మ నివాసం ఉంటున్న పూరి గుడిసె కరెంటు షాక్ తగిలి కాలిపోయింది. డీబీఆర్సీ డైరెక్టర్ దేవకుమార్ సహకారంతో టార్పాలిన్ పట్టా, బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు.

ఉద్యోగాల కల్పన, నైపుణ్యాభివృద్ధికి కృషి



నకరికల్లు: సహకార రంగం భవిష్యత్‌లో మరింత బలోపేతంగా వ్యవస్థీకృతమై నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తుందని సబ్ డివిజనల్ కో–ఆపరేటివ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి అన్నారు. అఖిలభారత 71వ సహకార వారోత్సవాలను నకరికల్లులోని సొసైటీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో సహకార పతాకా విష్కరణ చేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సహకార సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, కోల్డ్ స్టోరేజీలు, మల్టీ ఫెసిలిటీ సెంటర్‌లు కేటాయించి, వరపతేతర వ్యాపారం నిర్వహించబడుతుందన్నారు. ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. అనంతరం సీఈఓ ప్రసాద్ సభ్యులతో ప్రతిజ్ఞ చేయించి సహకార సూత్రాలు వివరించారు. సంఘం ఇన్‌చార్జి పర్సన్ మహేష్, ఉద్యోగులు, రైతులు పాల్గొన్నారు.

వానరాల స్వైరవిహారంతో బెంబేలు!



15వ వార్డులో వీధి కుక్కల స్వైర విహారం



13వ వార్డులో వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కోతులు

- మాచర్ల పట్టణంలో కోతులు, కుక్కల హల్‌చల్
- భయభ్రాంతులకు లోనవుతున్న ప్రజలు
- నియంత్రణ చర్యలు చేపట్టని పాలకులు

మాచర్ల రూరల్: పట్టణంలో కోతులు, కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కోతులు గుంపులు గుంపులుగా ఇళ్ల మీదకు వస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇక వీధి కుక్కల స్వైర విహారం చెప్పనక్కర్లేదు. రాత్రిళ్లు ఇళ్లవద్దకు గుంపులు గుంపులుగా వచ్చి రాకపోకలు సాగించే వారిపై దాడులు చేస్తుండటంతో పాదాచారులు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇక మూగజీవాలైన ఆవులు రోడ్లపైకి వచ్చేస్తూ ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. అంతేకాకుండా వచ్చేపోయే వాహనాలు ఢీకొని గాయాలపాలవుతూ అనారోగ్యానికి గురవుతున్నాయని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతుల బెడద అరికట్టేదెప్పుడు?

పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కోతుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలన్నా, ఇంట్లోకి వెళ్లాలన్నా కోతులు, గుంపులు గుంపులుగా వీధుల్లో, ఇళ్ల పైన ఉంటుండడంతో జనం భయంభయంగా వెళ్లాల్సిన పరిస్థితి. ప్రజలు కిరాణా సామగ్రి, తినుబండారాలు, కూరగాయలు, పండ్లు తీసుకురావాలన్నా బెంబేలెత్తాల్సిన దుస్థితి.

చేతికర్రలు ఇచ్చి పాఠశాలలకు..

ఇక పాఠశాలలకు వెళ్లే చిన్నారుల పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. వారిని పాఠశాలలకు పంపే సమయంలో తల్లిదండ్రులు స్కూల్ బ్యాగుతో పాటు చేతి కర్రలు ఇచ్చిపంపుతున్నారు. ఇప్పటికే చాలా మంది కోతుల బారిన పడి గాయాలపాలై వైద్యశాలల్లో చికిత్స పొందిన సంఘటనలున్నాయి. గతంలో రామాటాకీస్ వీధిలో ఓ మహిళ బట్టలు ఆరేసేందుకు వెళ్లి కోతులు దాడి చేయటంతో ఆ మిద్దె మీద నుంచి పడి చనిపోయింది. నాలుగేళ్ల క్రితం కోతులను బోనుల్లో పట్టించిన పురపాలక సంఘ అధికారులు నేడు వాటి సంగతి మరువటం బాధాకరం. కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేయాలని ఇటీవల తీర్మానించిన మున్సిపల్ పాలకవర్గం కోతుల నియంత్రణపై చర్చించకపోవటం విచారకరం. ఇక ఆవుల పరిస్థితి పై కూడా ఆలోచన చేయకపోవటం బాధాకరం. ఇప్పటికైనా పురపాలక సిబ్బంది స్పందించి కోతులు, ఆవుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

కోతులను పట్టిస్తాం..



కోతుల నివారణకు చర్యలు చేపడతాం. వాటిని పట్టించి అడవిలో వదిలేందుకు కోతులు పట్టే బృందాన్ని ఇక్కడకు రప్పించి బెడద తొలగిస్తాం. కుక్కలను పట్టుకొని వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశాం. రెండో రోజుల్లో కుక్కల బెడద తొలగిస్తాం.

– ధూళిపాళ్ళ వేణుబాబు, మాచర్ల మున్సిపల్ కమిషనర్

అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

- డ్వామా పీడీ సిద్ధా లింగయ్య
- ప్రజా వేదికలో రూ.85వేల రికవరీ



ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధా లింగయ్య

మాచర్ల రూరల్: జాతీయ ఉపాధి హామీ పథకంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా.. విధుల్లో నిర్లక్ష్యం వహించినా.. అర్హులకు పనులు కల్పించకపోయినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధా లింగయ్య హెచ్చరించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. జాతీయ ఉపాధి హామీ పథకం నూరు శాతం అమలయ్యేలా అధికారులు పనిచేయాలని, పనులు జరుగుతున్న ప్రాంతాలలో ఖచ్చితంగా ప్రాథమిక రక్షణ చర్యలలో భాగంగా ఫస్ట్ ఎయిడ్ కిట్, మంచినీరు, వేసవిలో టెంట్లు, మజ్జిగ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనికి రాని కూలీలకు హాజరైనట్లు మస్టర్లు వేశారని, అలాగే చనిపోయిన వారి పేర్ల మీద కూడా పేమెంట్లు చేయించటం జరిగిందని, వేలిముద్రలు, సంతకాలు లేకుండా నగదు బదిలీ చేయటం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మస్టర్లకు, రిజిష్టర్‌కు, ఎం.బుక్‌కు తేడాలున్నాయన్నారు. కొన్ని కుటుంబాల్లో భార్యకు, భర్తకు జాబ్ కార్డులను అందించటం తదితర వాటికి పాల్పడ్డారన్నారు. వారిపై చర్యలు తీసుకుని, నగదును రికవరీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, కింది స్థాయిలో జరుగుతున్న పనుల పర్యవేక్షణలో నిజాయితీగా వ్యవహరించి ఎలాంటి తప్పులకు తావులేకుండా చూడాలన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.9,03,24,457 పనులు జరగ్గా, వాటిలో పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.1,77,94,658ల పనులు జరిగాయన్నారు. ప్రజా వేదికలో జరిగిన తనిఖీలో రూ.85,955 రికవరీ జరిపినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీఓ ఆర్.ఫణికుమార్, ఎస్ఆర్‌పీ జెఎస్ రాజు, ఏపీఓలు నాగ శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయం



అప్పటి తమ గురువులతో పూర్వ విద్యార్థులు

- విజయపురి సౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- 40 ఏళ్ల తరువాత కలుసుకున్న 1983–84 బ్యాచ్ 'పది' విద్యార్థులు

విజయపురిసౌత్: 40 ఏళ్ల క్రితం ఒక్కచోటే ఆడారు.. పాడారు.. చదువుకున్నారు.. అనంతరం జీవితంలో వివిధ దారులు వెతుక్కుంటూ వెళ్లిపోయారు. సుదీర్ఘ జీవన ప్రయాణంలో విభిన్నదారుల్లో సాగి వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణించారు. జీవితం యాంత్రికమైపోయింది. మనసులో ఏదో తెలియని వెలితి అందరిని పట్టి పీడించింది. మూలమేదో గుర్తించారు. ఒక్కసారి చిన్ననాటి స్నేహితులను కలుసుకోగలిగితే చాలు అనుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 50 మంది చిరునామాలు సేకరించారు. అందరూ ఒక్కచోట కలుసుకుని సందడి చేశారు.

విజయపురిసౌత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా శనివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి.. ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒక్కసారిగా అందరిలో ఉద్వేగం ... అపురూపమైన నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పర పలకరింపులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఫోన్ నెంబర్లు, చిరునామాలు సేకరించుకున్నారు. తమ ఉన్నతికి దోహద పడిన ఆనాటి గురువులను గుర్తు చేసుకున్నారు. అపురూపమైన జ్ఞాపకాలను తమ స్నేహబంధానికి గుర్తుగా గ్రూఫ్ ఫొటోలు దిగారు. ఆనాటి గురువులు బేగ్ మాస్టర్, ప్రభాకర్‌లను పూలదండలు, శాలువతో ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు చాంద్ పాషా, వై.రంగనాయకులు, డి.వి.సుబ్బారావు, కె.భాస్కర్ రావు, వినయతుల్లా, చెవుల నాగార్జున, భగవాన్ శ్రీను, వసంత, శ్యామల, రత్నకుమారి, ఎ.చిన్నానాయక్, శంకరమ్మ, లూసి, అనురాధ, జ్ఞానకుమార్, విల్సన్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, చింతమల్ల శ్రీనివాస్, రాజు, యోగి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన పరమేశ్వర నామస్మరణ



ప్రత్యేక అలంకరణలో భ్రమరాంబికాదేవి



సత్రశాల దేవస్థానంలో నిర్వహిస్తున్న హోమం

రెంటచింతల: కైలాసనాథుడైన శివయ్యస్వామికి ఎంతో ప్రీతికరమైన కార్తిక మాసం సందర్భంగా శనివారం అతిపురాతన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి దేవస్థానం పరమేశ్వరుని నామస్మరణతో మార్మోగింది. దేవస్థానంలో రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి స్వామివార్లకు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఆవరణలోని స్పటికలింగం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులకు, వివిధ స్వామి మాలలు స్వీకరించిన మాలధారులకు మిట్టగుడిపాడు సర్పంచ్ గొట్టం ప్రమీల గురవారెడ్డి, వి. వెంకటేశ్వర్లు, మల్లేశ్వరి, గాదె రామిరెడ్డి, కోటేశ్వరి, వి.గిరీష్ కుమార్, నాగలక్ష్మి, చల్లా మట్టారెడ్డి, లక్ష్మమ్మ దంపతులు అన్నదానం చేపట్టారు. ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి, అన్నదాన కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యర్థరహిత ఆలయంగా తిరుపతమ్మ దేవాలయం

వెల్దుర్తి: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పలపాడులో ఉన్న గోపయ్య స్వామి తిరుపతమ్మ దేవస్థానాన్ని ఐటీసీ ఆధ్వర్యంలో వ్యర్థ రహిత దేవస్థానంగా ఎంపిక చేసినట్లు సీఓ మాడె బోయిన గురు ప్రసాద్ తెలిపారు. శనివారం ఉప్పలపాడు గ్రామంలో జరిగిన సమావేశంలో గురు ప్రసాద్ మాట్లాడుతూ దేవస్థాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటం ఆలయ కమిటీ, భక్తులందరి బాధ్యత అన్నారు. తడి వ్యర్థాలను ఎరువుగా మార్చే పద్ధతుల గురించి వివరించారు. అనంతరం డస్ట్‌బిన్స్‌ను ఆలయ పూజారి వీరమ్మకు అందజేశారు. గ్రామస్తులు మాడేబోయిన శ్రీనివాసరావు, వేముల సురేష్, దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బిషప్ సత్యకిరణ్‌కు సేవా రత్న అవార్డు



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్ సేవలను గుర్తించి హైదరాబాదులో శుక్రవారం భారతీయ స్ఫూర్తి సేవా రత్న నేషనల్ అవార్డును ప్రదానం చేశారు. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్, ఏషియన్ వేదిక్ ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ ఆధ్వర్యంలో అవార్డును అందజేశారు. బిషప్ ముక్తిపూడి సత్యకిరణ్ మాట్లాడుతూ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఏషియన్ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పిడుగురాళ్ల లైబ్రరీలో ఆసక్తిగా దినపత్రికలు, పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



దుర్గి గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

పిడుగురాళ్ల: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం మూడవ రోజు చిన్నారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి కారంపూడి రాజశేఖర్ గ్రంథాలయ ఉద్యమం గురించి వివరించారు. ఈ సందర్భంగా ఉద్యమ ప్రముఖులైన ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రంగయ్య, పాతూరు నాగభూషణం తదితరులును గూర్చి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు గ్రంథాలయంలోని పలు దినపత్రికలు, వార పత్రికలను వీక్షించి, పుస్తక పఠనం చేశారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు..

దుర్గి: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మూడవ రోజు శనివారం జూనియర్స్ విభాగంలో 'గ్రంథాలయ ఆవశ్యకత', సీనియర్స్ విభాగంలో 'సమాజం పై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరిగిందని గ్రంథాలయాధికారి పి.వేణుగోపి అన్నారు. ఈ పోటీలలో చలపతి స్కూల్, అయ్యప్ప విద్యానికేతన్, ప్రగతి స్కూల్, దుర్గి జెడ్పీహెచ్ఎస్, సేక్రడ్ హార్ట్ పబ్లిక్ స్కూల్, ఓబులేశునిపల్లెలో జెడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఉపాధ్యాయులు టి.లక్ష్మీనారాయణ, షేక్ అబ్బాస్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహించారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

క్రోసూరు: మద్యం షాపుల్లో మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టి.తులసి నిర్వాహకులను హెచ్చరించారు. శనివారం సీఐ, సిబ్బంది ఎక్సైజ్ పరిధిలోని లైసెన్సులు పొందిన 10 మద్యం షాపులను తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మద్యం షాపు ఎదుట ధరల పట్టిక పెట్టించామన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే 83092 25378 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐగా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి 10 బెల్ట్‌షాపుల నిర్వహకులపై కేసులు, ఏడు తెలంగాణ మద్యం కేసులు పెట్టినట్లు చెప్పారు. అచ్చంపేట మండలంలో వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు



దుర్గా, ఆదివిష్ణు దంపతులకు రోటరీ క్లబ్ నేషనల్ బిల్డర్ అవార్డు అందజేస్తున్న క్లబ్ అధ్యక్షులు, సభ్యులు


మాచర్ల రూరల్: సమాజ మార్గ నిర్దేశకులు ఉపాధ్యాయులని వారి సేవలు అమూల్యమని ప్రొఫెసర్ డాక్టర్ బి.సూర్యనారాయణ అన్నారు. శనివారం పట్టణంలోని ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ భవిష్యత్ తరగతి గదిలోనే మొదలవుతుందని.. అమ్మా నాన్నల తరువాత గురువు స్థానం చాలా గొప్పదన్నారు. అన్నీ వృత్తులను తయారు చేసే ఉపాధ్యాయ వృత్తి, బాధ్యతతో కూడుకుందని చెప్పారు. కేసీపీ జీఎం వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించి వారికి విలువలతో కూడిన విద్యాబోధనను అందించాలని ఆయన కోరారు. రోటరీ డిప్యూటీ గవర్నర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య మాట్లాడుతూ వెనుకబడిన పల్నాటి ప్రాంతంలోని 25 ఉన్నత పాఠశాలల్లో 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి నేషనల్ బిల్డర్ అవార్డులను అందిస్తూ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్న రోటరీ సేవలు అమూల్యమన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు దుర్గా, ఆదివిష్ణు దంపతులను సన్మానించారు. అవార్డు ప్రదానోత్సవ కన్వీనర్ జేవీకేఎస్ ప్రసాద్, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు కొండవీటి కృష్ణకుమారి, నిమ్మగడ్డ సురేఖ, కోశాధికారి లక్ష్మి, నిర్వాహకులు కె.నాగేశ్వరరావు, మురహరిరావు, ఇక్కుర్తి శంకర్, సత్యప్రసాద్, నాగూర్‌వలి, నాగేశ్వరరావు తదితరులున్నారు.

బడ్జెట్‌లో చేనేతకు మొండి చేయి

సత్తెనపల్లి: కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో చేనేతకు మొండి చేయి చూపిందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా శివ దుర్గారావు, జిల్లా కార్యదర్శి అనుమల వీరబ్రహ్మం శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో కేటాయించకపోవడం దారుణమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు గతంలో అధికారంలో ఉన్నప్పుడు హైటెక్ యుగంలో గుంత, మగ్గం అక్కర్లేదని మాట్లాడటం జరిగిందన్నారు. చేనేతను పూర్తిగా ధ్వంసం చేయడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ఆరోపించారు.

ప్రజా ప్రతినిధులకు గౌరవమివ్వాలి

ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

రాజుపాలెం: ప్రభుత్వాలు మారుతూ ఉంటాయని, అధికారులు మాత్రం బాధ్యత గుర్తెరిగి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులందరిని ఆహ్వానించాలని ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల చేత ఎన్నుకోబడిన వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులందరిని గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులందరూ అధికారులకు సమానమన్నారు. ముందుగా మండల స్థాయి అధికారులు వారి శాఖలలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. నివేదికలు అందించారు. తహసీల్దారు దుర్గేష్‌రావు, పీహెచ్‌సీ వైద్యాధికారి కృష్ణకుమార్ ఈవోపీఆర్డీ ముక్కంటి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



దుప్పట్లు, నోటు పుస్తకాల పంపిణీ చేస్తున్న అధికారులు

రాజుపాలెం: కొండమోడు పరిధిలోని వీరమ్మ రూరల్ డెవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దారు దుర్గేష్‌రావు, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ శంకరరావు జవహర్‌లాల్ నేహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనాథ పిల్లలకు, వృద్ధులకు దుప్పట్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు చేస్తున్న గరికపాటి శంకరరావును అభినందించారు. ఎంఈవో మల్లికార్జునశర్మ, ఐసీడీసీ సూపర్‌వైజర్ స్వర్ణలత, పరిపాలనాధికారి బసవకుమారి, టీఎస్ఆర్ కాలేజీ డైరెక్టర్ కోనేటి నరసింహారావు, ప్రసన్న పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

సత్తెనపల్లి: దళిత కౌలు రైతు పత్తి పంట పొలాన్ని రోటోవేటర్‌తో దున్నిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. శనివారం డీఎస్పీ ఎం.హనుమంతరావు సమాచారం మేరకు..అమరావతి మండలంలోని ఉంగుటూరు గ్రామంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కౌలు రైతు దార్ల వీరబాబు తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన రైతుల వద్ద 2.20 ఎకరాల భూమిలో ఐదు నెలల నుంచి పత్తి పంటను సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో ఉంగుటూరు గ్రామానికి చెందిన పెంట్యాల శేషగరిరావు కోతకు వచ్చిన పైరును దున్నేశాడు. వివాదాల కారణంగా కౌలు రైతు దార్ల వీరబాబు సాగు చేసుకుంటున్న పంటను దౌర్జన్యంగా దున్నడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి, శేషగిరిరావును అదుపులోకి తీసుకుని రిమాండుకు పంపినట్లు తెలిపారు.

నష్టపోయిన వరి పొలాల పరిశీలన



బెల్లకొండ: మండలంలోని నాగిరెడ్డిపాలెంలో బెల్లంకొండ, యర్రపాలెం మేజర్ కాలువకు గండిపడి నష్టపోయిన వరి పొలాలను శనివారం వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పరిశీలించారు. వరి కోతకు వచ్చే సమయంలో గండి పడడంతో అధిక నష్టం వాటిల్లిందని రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దారు అఫ్రిసున్నిసా బేగం, ఏఓ కృష్ణయ్య దాదాపు 14.61 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. పంట నష్టం అంచనా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. రైతులకు నష్ట నివారణ చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వెంకయ్య సిబ్బంది అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.